ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
గురువారం 2 మే 2024





● ట్రాక్టర్లపై తరలివస్తున్న మహిళలు



● చీరాల సభకు హాజరైన జనసందోహం

జట్టు కుదిరింది

గెలుపు మనదే



జతకట్టాం... ఇక గెలుపే..

బందిపోట్లను మించిన దోపిడి

జగన్ ఓ వ్యాపారి, దళారి. ప్రజలను బలహీనతను సొమ్ము చేసుకున్నాడు. నాసి రకం మద్యంతో 30,000 మంది మహిళల తాళిబొట్లు తెంచాడు. ఇసుకు మాఫియాతో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల ఉసురు పోసుకున్నాడు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లూ బందిపోట్లను మించిన దోపిడి జరిగింది. రూ.13 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాడు. సంపద సృష్టి లేక పోవడంతో అప్పిచ్చేవాడు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టాడు.

- చీరాలలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తాం
- మాఫియా రాజ్యానికి చరమగీతం పాడతాం
- టూరిజం పరంగా తీరప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందిస్తాం
- చీరాల ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



ప్రసంగిస్తున్న చంద్రబాబు వేదికపై ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, ఎంఎం కొండయ్య

ఇబ్బందులున్నా పోరాడారు..

ఎమ్మెల్యేలు అనగాని, గొట్టిపాటి, ఏలూరి సాంబశివరావులు ఇబ్బందులున్నా పార్టీలోనే ఉండి పోరాడారు తప్ప పారిపోలేదు. అడ్డదారులు తొక్కలేదు. టీడీపీపై ఉన్న అభిమానంతో చీరాలలో ఓ పెద్దమనిషిని గెలిపిస్తే ఇప్పుడు ఆయన ఎక్కడున్నాడు. నిక్కచ్చిగా నష్టాన్ని కష్టాన్ని తట్టుకున్న వాళ్లనే ప్రోత్సహిస్తాం.





మా బాబే..

చీరాల, మే 1: బాపట్ల లోక్‌సభ పరిధిలో జట్టు కుదిరింది. గెలుపు మనదే. పది రోజులు కష్టపడండి. భవిష్యత్ బాధ్యత మేం తీసుకుంటాం. రాష్ట్రంలో మాఫియా రాజ్యం ఏలుతోంది. ప్రైవేటు సైన్యంతో సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. వాటికి చరమగీతం పాడతాం.. అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. చీరా ల బైపాస్ 216 జాతీయ రహదారి పక్క నున్న టీడీపీ కార్యాలయం సమీపంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాగళం బహరంగ సభలో చంద్రబాబు ప్రసంగిం చారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాల నను ఎండగడుతూ, నేతల రౌడీ రాజకీయాలను తూర్పారపడుతూ, వైసీపీ మేనిఫెస్టో డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తూ, కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ చంద్రబాబు ప్రసంగం సాగింది. టీడీపీ హయాం లో ఉచితంగా ఇసుక ఇస్తే ఆనాడు ట్రాక్టరు ఇసుకు రూ.వెయ్యికి ఇంటికి చేరితే, సైకో పాల నలో ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు అయిందన్నారు. నాసిరకం మద్యం, దానిలో ఆన్‌లైన్ విధానం లేకుండా సొమ్మును దోచుకుంటున్న జగ్గాబాయ్ దళారి చర్యలను, అరాచకాలను తుదముట్టిస్తామన్నారు. పన్నుల బాదుడులో జగన్ బ్రిటీష్ వాళ్లను మించిపోయాడన్నారు. ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద కాపలా ఉంచిన ఘనుడు జగన్ అన్నారు. అలాంటి వ్యక్తి విద్యావ్యవస్థ ఏం గౌరవం ఉంటుందని ప్రశ్నించారు. జగన్ చేసిన చెడ్డపనులను నియంత్రిస్తూ, ఒకటి, రెండు మంచి పనులు ఉంటే వాటిని కొనసాగిస్తామన్నారు.

చీరాలకు ప్రత్యేక ప్రాధాన్యం

చీరాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామన్నారు. చీరాలలో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత యువత ఇంటి నుంచే ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన వనరులు సమకూరుస్తామన్నారు. టూరిజం పరంగా అభివృద్ధి చేస్తామన్నారు. చీరాల నియోజవకర్గ పరిధిలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలపై కొండయ్య చేసిన విజ్ఞప్తులపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అందులో భాగంగా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కుందేరు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. పంట కాల్వల మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు. పట్టణంలో ఫైర్ ఆఫీస్ గేటు, కారంచేడు గేటు సెంటర్లో ఆర్‌వోబీ(రోడ్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. టూరిజంగా పరంగా అభివృద్ధి చేస్తామన్నారు. నేతన్నలకు పవర్‌లూమ్ ఉంటే 500 యూనిట్ల వరకు, సాధారణ మగ్గాల వారికి 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితమని హామీ ఇచ్చారు. నేతన్నలకు ఏడాదికి రూ.24 వేలు అందజేస్తామని, వారు జీఎస్టీ చెల్లించే పనిలేదని, ఎవరన్నా చెల్లిస్తే తిరిగి ఇప్పిస్తామని తెలిపారు. బీసీలకు అవసరమైన పరికరాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఆయారాం.. గయారంలు అవసరం లేదు

వారి అవసరాలకు వచ్చి పోయే ఆయారాం.. గయారాంలు తమకు అవసరం లేదని తాజా మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను చంద్రబాబు పరోక్షంగా విమర్శించారు. గెలిచి మరలా టీడీపీలోకి వస్తామని చెప్పే వారికి బుద్ధి చెప్పాలన్నారు. మరొకాయన ఎమ్మెల్యేగా గెలిచి పార్టీలో చేరారు.. అన్ని పనులు చేసుకున్నారు.. తర్వాత పారిపోయారన్నారు. రౌడీయిజం చేసి లబ్ధి పొందాలనుకునే వారికి తగిన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.



సూపర్ సిక్స్ పథకాలు చూపిస్తున్న మహిళలు



సెల్‌ఫోన్‌లో బంధిస్తూ..



విజయచిహ్నం చూపిస్తున్న మహిళలు

గ్రానైట్.. హాంఫట్



వేమవరం పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీ

- ప్రభుత్వ తీరుతో ప్రమాదంలోకి..
- ఐదేళ్ల నుంచి వైసీపీ దోపిడీతో కుదేలు
- విద్యుత్ బిల్లులు, ప్రభుత్వ వేధింపులతో దీనస్థితిలోకి..
- వేలమంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకం

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): వేల మందికి ఉపాధి కల్పిస్తూ, ప్రభుత్వానికి రూ.కోట్లలో రాయల్టీ కడుతూ వెలుగులీనే గ్రానైట్ పరిశ్రమ వైసీపీ ప్రభుత్వ విధానాలతో అంపశయ్యమీదకి చేరింది. మార్టూరు, సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలో దాదాపు 800 గ్రానైట్ పరిశ్రమలు, 40 వరకు క్వారీలు ఉన్నాయి. ప్రభుత్వం మారగానే వీటి నిర్వహణే యజమానులకు భారంగా మారింది. 2019కు ముందు జగన్ పాదయాత్రలో గ్రానైట్ పరిశ్రమలకు ఎన్నో వరాలు కురిపించారు. అధికారం చేపట్టిన తర్వాత వాటిలో ఒక్కటీ పట్టాలెక్కకపోగా, నేతల దోపిడీ, కక్షసాధింపులు పతాక స్థాయికి తీసుకెళ్లిన ఘనత వైసీపీది. అనధికార చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వందల కోట్ల సొమ్మును భోంచేశారు. వైసీపీ నేతల దెబ్బకు కొంతమంది యజమానులు పరిశ్రమలనే మూసివేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఐదేళ్ల నుంచి గ్రానైట్ రంగంపై అవలంభించిన తీరువల్ల వేలమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. యూనిట్ రూ.3.50కే విద్యుత్ ఇస్తామని పాదయాత్రలో జగన్ హామీ ఇవ్వగా దానిని మరిచి రూ.9కి పెంచేశారు. మైనింగ్ అధికారులను ప్రయోగించి రీసర్వేకు కావాల్సిన హద్దురాళ్లను కోయించి ఆ తర్వాత వాటిని తీసుకోకుండా గ్రానైట్ రంగాన్ని నష్టాల బాట పట్టించారు. రూ.22 వేల రాయల్టీకి బదులు రూ.27 వేలు వసూలు చేశారు. కొవిడ్ సమయంలో కట్టిన విద్యుత్ బిల్లులను తిరిగి చెల్లిస్తామని చెప్పి.. ఇప్పటికీ పట్టించుకోలేదు.

వందల కోట్లలో దోపిడీ..

గ్రానైట్ రంగాన్ని అనధికారిక ఆదాయ వనరుగా మార్చుకోవడంలో వైసీపీ కొత్త రికార్డులను నెలకొల్పింది. దాదాపు రూ.500 కోట్లు దోచుకున్నారని టీడీపీ ఆరోపిస్తోంది. మార్టూరు, బల్లికురవ పరిధిలో దాదాపు 200 పైగా గ్రానైట్ రవాణా లారీలే లక్ష్యంగా కప్పం కట్టడాన్ని దాదాపుగా వ్యవస్థీకృతం చేశారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్ల సాగిన దోపిడీ పర్వం ఒక ఎత్తయితే గడచిన ఏడాదిన్నరగా సాగిన దందా మరో ఎత్తుగా ఉంది. పర్చూరు నియోజకవర్గానికి వైసీపీ నేతగా వచ్చిన ఓ వ్యక్తి ఈ దందాలో అన్ని హద్దులను చెరిపేసి యజమానులను బెంబేలెత్తించారన్న ఆరోపణలున్నాయి. వసూళ్లపై గొంతెత్తిన పరిశ్రమల యజమానులపై అధికారులను రంగంలోకి దింపి భయభ్రాంతులకు గురిచేశారు. వైసీపీ నేతలకు కొందరు అధికారులు సహకరించారు. మరి కొంతమంది అధికారులు గ్రానైట్ పరిశ్రమలు, క్వారీల్లో దాడులకు తెగబడ్డారు.

ఎమ్మెల్యేలపైనా గురి...

ప్రభుత్వం మారిన దగ్గర నుంచే అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ లక్ష్యంగా పాలకపార్టీ కక్షసాధింపులకు దిగిన సంగతి తెలిసిందే. రవికుమార్ ఫ్యాక్టరీలపై వందల కోట్ల జరిమానాలను ప్రభుత్వం విధించిన సంగతీ విధితమే. చివరకు ఆయన బంధువుల ఫ్యాక్టరీలే లక్ష్యంగా ప్రత్యేక బృందాన్ని మూడు రోజుల పాటు మార్టూరు పరిధిలో హల్‌చల్ చేయించారు. ఇక పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుల ఫ్యాక్టరీలే లక్ష్యంగా సోదాల పేరిట హైడ్రామాకు తెరతీసిన సంగతి కూడా తెలిసిందే.

కోలుకోవాలంటే..

ఈ ఐదేళ్లలో కకావికలమైన గ్రానైట్ రంగం కోలుకోవాలంటే అంత ఆషామాషి కాదనే అభిప్రాయాన్ని పరిశ్రమల యజమానులు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పునర్ వైభవం సాధించాలంటే రాబోయే ప్రభుత్వం విద్యుత్ బిల్లుల విషయంలో ఉదారంగా వ్యవహరించడంతో పాటు, వేల మంది కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకుని రాయల్టీ విషయంలో మినహాయింపు ఇవ్వాలి. అనధికార కప్పం వసూళ్లకు చెక్ పెట్టగలిగితేనే గ్రానైట్ రంగం కోలుకుంటుందని చెబుతున్నారు.

పేదరికం లేని ముస్లిం సమాజ స్థాపనే లక్ష్యం

● శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్



ప్రచారంలో మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, పక్కన ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే1: రాష్ట్రంలో పేదరికం లేని ముస్లిం, మైనార్టీ సమాజాన్ని సాధించటటమే చంద్రబాబు, పవన్ కల్యాన్‌ల లక్ష్యమని శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. పట్టణంలోని గుర్రాలచావిడి నుంచి తూర్పు మాలపల్లె మీదుగా రహమత్ నగర్, మద్దినగర్, సుభానీ నగర్‌లలో ఎన్నికల ప్రచారం, రోడ్ షో నిర్వహించారు. వాటితో పాటు కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి, మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కూడా పాల్గొన్నారు. అనం తరం షరీఫ్ మాట్లాడుతూ టీడీపీ స్థాపించిన దగ్గర నుంచి తాను ఇక్కడే ఉన్నానంటే కారణం పార్టీ లౌకిక విధానాలు, మత సామరస్యానికి చేస్తున్న కృషే అన్నారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత 2600 కోట్ల బడ్జెట్ ముస్లింలకు కేటాయించి ముస్లింల పేదరికాన్ని దూరం చేయటా నికి 45వేల మందికి లక్ష రాయితీపై రూ.5 లక్షలు ఆర్థికసాయం చేశారన్నారు. ఇలాంటి విధానం వైసీపీ ప్రభుత్వంలో ఉందా? అని ప్రశ్నించారు. జగన్ సీఎం అయిన తరువాత ఒక ముస్లింకైనా రుణం ఇచ్చారా?, ఇస్లామిక్ బ్యాంక్ అన్నారు, గాలికి వదిలి వేశారు. దుల్హన్ పథకాన్ని నిర్వీర్యం చేశారు అని అన్నారు.. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతు టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు గురించి కొంతమంది దుష్ప్ర చారంచేస్తున్నారని, రాష్ట్ర పునఃర్నిర్మాణం, అభివృద్ధి ముస్లింలను పేదరికం కష్టాల నుంచి దూరం చేయటమే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల లక్ష్యమన్నారు. ఎన్ఆర్‌సీ, సీఏఏకి చట్టబద్దత బిల్లులకు ఎందుకు మద్దతు ఇచ్చారో వైసీపీ నాయకులు చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న భాష్యం ప్రవీణ్

చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● మృతదేహాలను సందర్శించి నివాళులర్పించిన భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 1: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన మండలంలోని రామాపురంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. గొడ్డుగొర్ల కిషోర్, బుజ్జి దంపతుల రెండవ కుమారుడు అబీ, గొడ్డు గొర్ల నాగేశ్వరరావు, మరియమ్మ దంపతుల ఒక్కగాని ఒక్క కుమారుడు మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్ళారు. రాత్రి 8:30 గంటలైనా ఇంటికి రాక పోవటంతో గాలించగా అనుమానం వచ్చి చెరువుగట్టుకు వెళ్లారు. సందీప్ చెప్పులు చెరువుగట్టుపై ఉండటంతో ప్రమాద వశాత్తు చెరువులోపడి మృతిచెంది ఉంటారని చెరువులోకి దిగి గాలిం చారు. ఇద్దరి చిన్నారుల మృతదేహాలు లభ్యమ య్యాయి. చిన్నారుల మృతదేహాలను కాలనీలోని వారి గృహాలకు తీసుకు వెళ్ళారు. సందీప్ కుటుంబంలో ముగ్గురు ఆడ పిల్లలు కాగా సందీప్ ఒకే ఒక్క కుమారుడు. మృతిచెందిన ఇద్దరు 7వ తరగతి చదువుతు న్నారు. వేసవి కాలం కావటంతో చెరువు వైపు వెళ్ళి ప్రమాద వశాత్తుచెరువులో పడి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆయా గ్రామానికి వెళ్లి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. అనంతరం బాలుర మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

చంద్రబాబు వస్తేనే ఎస్సీ వర్గీకరణ

● మాదిగల ఆత్మీయ సమావేశంలో మందా కృష్ణమాదిగ

● పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని



మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు వేదికపై మందకృష్ణమాదిగ, యరపతినేని

దాచేపల్లి, మే1: మా జాతిని గెలిపించుకునే తపన తప్ప నాకు మరో ధ్యాసలేదు. నా జాతి వర్గీకరణతోనే అభివృద్ధిని సాధిస్తుంది.. మీ బిడ్డను, మీ అన్నను 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. అక్కడ ప్రధాని మోదీ మనకు హామీ ఇచ్చాడు.. ఇక్కడ చంద్రబాబు మనకు అండగా వున్నాడు.. చంద్రబాబు వస్తేనే వర్గీకరణకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఉద్ఘాటించారు. బుధవారం దాచేపల్లిలోని ఎస్సీ కాలనీలో మాదిగల ఆత్మీయ సమావేశాన్ని గురజాల నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మందా కృష్ణ మాదిగతో పాటు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులు హాజరై ప్రసంగించారు.

మందా కృష్ణమాదిగ మాట్లాడుతూ 'నాకు గతంలో వైఎస్సార్, చంద్రబాబునాయుడులు పదవులిస్తామన్నారు. నా జాతి అభివృద్ధే నాకు ముఖ్యమన్న లక్ష్యంతోనే పదవులను తీసుకోలేదు. ఏబీసీడీ వర్గీకరణ చేయాలి, నా జాతి మొత్తం బాగు పడాలని పోరాటం చేస్తున్నాను'అని కృష్ణమాదిగ అన్నారు. నాడు చంద్రబాబునాయుడు సీఎంగా వున్నప్పుడు 22వేల మందికి ఉద్యోగాలు ఇప్పించామన్నారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మాదిగలకు నమ్మక ద్రోహం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ పెట్టారు.. ఒక్క రూపాయి నిధులు కూడా లేవు. ఈ ఐదు సంవత్సరాల్లో మనల్ని రాజకీయంగా ఎదగనీయ కుండా చేశారు. మాదిగలకు నమ్మక ద్రోహం చేసిన వ్యక్తి సీఎం జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మా అన్న యరపతినేని శ్రీనివాసరావు, మా తమ్ముడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలును గెలిపించాల్సిన అవసరముందని కృష్ణమాదిగ అన్నారు.

12 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తాం : ఎంపీ అభ్యర్థి లావు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 12 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాదిగల ఆత్మీయ సమావేశంలో వివరించారు. నరసరావుపేటలో బాబు జగజ్జీవన్‌రావ్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పార్లమెంట్ పరిధిలో 50 కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చుచేస్తామన్నారు. టీడీపీ అధికారం లోకి రాగానే అర్హత కలిగిన వారికి రుణాలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటుచేశారు కానీ చైర్మన్‌కు అధికారం లేదు.. గౌరవం లేదు. దళితులకు సంబంధించిన 25 స్కీమ్‌లను రద్దుచేశారు. వాటిని పునఃప్రారంభిస్తామని వివరించారు.

మాదిగల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తా : యరపతినేని

మాదిగల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తానని, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగతో గత 30 సంవత్సరా లుగా మాకు అన్నదమ్ముల్లా అనుబంధం వుందని యరపతినేని తెలిపారు. ఏ సమస్య వచ్చినా నేనున్నానని, మాదిగలను అన్నివి. దాల ఆదుకుంటానని, కమ్యూనిటీ భవనాలు కావాలన్నా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందించాలన్నా మీకెప్పటికీ అందు బాటులో వుంటానని యరపతినేని తెలిపారు. గురజాల నియోజక వర్గ పరిధిలోవున్న వేలాది మంది మాదిగలంతా సభా ప్రాంగణా నికి చేరుకోవడంతో దాచేపల్లిలోని రహదారి అంతా మాదిగ సోదరులతో నిండిపోయింది. సమావేశంలో డాక్టర్లు కర్నాటి వరలక్ష్మీ, వున్నం నాగమల్లికార్జునరావు, జనసేన నేతలు కటకం అంకారావు, మాతంగి సత్యానందం చిలుముల దుర్గారావు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టోతో

అన్నివర్గాల ప్రజలకు మేలు

● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని



కూటమి మేనిఫెస్టోపై మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే1: టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో అన్నివర్గాలకు మేలు కలిగించేలా వుందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పాటు మహిళకు వందనం, రైతుకు ప్రతి ఏడాది రూ.20 వేలు పెట్టుబడి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీతోపాటు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, ఉచిత ఇసుకతో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకు తుందన్నారు. ఏప్రిల్ నుంచి రూ.4వేలు పింఛన్‌ను ఇంటివద్దనే అందించేలా మేనిఫెస్టోలో ప్రకటించడం పింఛన్ దారుల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక లతో పాటు ఆర్యవైశ్య సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు, కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారిక కార్యక్ర మంగా చేపడతామని యరపతినేని తెలిపారు. రూ.10లక్షలు విలువ చేసే చంద్రన్న బీమా ప్రీమియం రుసుంను గురజాల నియోజక వర్గంలో లక్షన్నర మందికి స్వయంగా తానే చెల్లించడం జరుగుతుందని యరపతినేని తెలి పారు. ల్యాండ్ టైటిలింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేలా కూటమి మేనిఫెస్టో ఉందని యరప తినేని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

పట్టుకున్నది ఒకరిని.. కేసు మరొకరిపై !

● వైసీపీ నాయకుల ఒత్తిడితో సంబంధం లేని వ్యక్తిపై కేసు

మాచవరం, మే 1: ఎన్నికల నిబంధనలను అధికారులు తుంగలో తొక్కి వారే అక్రమార్కులకు దారిచూపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలైన దొంగ చిక్కినప్పటికీ వైసీపీ నాయకుల ఒత్తిడితో అతనిని వదిలేసి సంబంధం లేని వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెబుతున్న సెబ్ అధికారుల వైఖరిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మాచవరం ప్రభుత్వ మద్యం దుకాణంలో 20 మద్యం సీసాలు తీసుకొని వెళ్తున్న మాచవరం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇకరిని సెబ్ పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అంతలోనే వైసీపీ నాయకుల ఫోన్‌లో ఒత్తిడి తీసుకురావడంతో పట్టుకున్న వ్యక్తిని వదిలేసి వేరొక వ్యక్తిపై కేసు నమోదుచేశారు. ఈ విషయంపై విలేకరులు మాచవరం పోలీసులు, సెబ్ అధికారులను సంప్రదించేందుకు ఎంత ప్రయత్నించినా ఫోన్‌లు మాత్రం ఎత్తలేదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మద్యం తరలిస్తూ కిందపడి గాయాలైన వ్యక్తిని వదిలేసి మరొకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సెబ్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలపడం విడ్డూరంగా వుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాచవరం గ్రామానికి చెందిన ఏసుపొంగు రామారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ విలేకర్లకు తెలిపారు. ఈ సంఘటనపై దేశం పార్టీ శ్రేణులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



గారపాడులో గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్

పెదకూరపాడు, మే1: ఎన్నికల నియమావళిని ఉల్లంఘన జరిగినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పల్నాడుజిల్లా ఎస్పీ బీ.బిందుమాధవ్ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన గారపాడు గ్రామాన్ని బుధ వారం ఆయన సందర్శించారు. ఆ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకో వాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక సాధారణ అనేవిధంగా పోలింగ్ కేంద్రాలను విభజించామని, ఇందుకు తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు ఓటు హక్కు విలువల గురించి వివరిం చారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచిం చారు. ఎస్పీతో పాటు డీఎస్పీ గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, ఎస్ఐ వెంకటరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

3న క్రోసూరులో సీఎం జగన్ పర్యటన

క్రోసూరు: ఈనెల 3న సీఎం జగన్ క్రోసూరులో పర్యటించనున్నట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటు, సభా స్థలం మొదలైన వాటిని పరిశీలించారు. ఆయనతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ జీ.గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, సీఐ మంగారావు, క్రోసూరు ఎస్ఐ ఉన్నారు.

ఈవూరివారిపాలెంలో అర్ధరాత్రి ఉద్రిక్తత

● గ్రామంలో వైసీపీ కవ్వింపు చర్యలు

చిలకలూరిపేట, మే1: చిలకలూరిపేట మండలం ఈవూరివారి పాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామంలో సీతారామాంజనేయ స్వామి గుడి వద్ద గ్రామస్తులు వార్షికోత్సవం నిర్వహించుకున్నారు. అనంతరం గ్రామ వీధుల్లో భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. పైగా అదే రోజు గ్రామానికి చెందిన 50 ఎస్టీ కుటుంబాల వారు వైసీపీలో నుంచి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో రాత్రి 10.30 గంటల సమయంలో చిలకలూరిపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి కావటి మనోహర నాయుడు ఆ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్ళారు. బాణాసంచా కాలుస్తూ అనుచరులతో కలసి ఆయన గ్రామంలో ముందుకు సాగారు. అయితే గ్రామానికి చెందిన కొందరు సమయం ముగిశాక ఎన్నికల ప్రచారం చేయటం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. అయినా వైసీపీ వర్గీయులు వెనక్కి తగ్గలేదు. గ్రామ యువకులు తమ ప్రచారానికి అభ్యంతరం చెప్పటంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. కావటి సహా ఆయన అనుచరులు కొద్ది సేపు అక్కడ బైఠాయించారు అనంతరం చిలకలూరిపేట రూరల్ పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కన్పించలేదు. తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో చిలకలూరిపేట రూరల్‌పోలీసు స్టేషన్‌కు వచ్చి ఈఘటనపై ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఈవూరివారిపాలెం గ్రామానికి వెళ్ళి గ్రామస్తులకు భరోసా ఇచ్చి వచ్చారు. ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని, ఇటువంటి కుట్రలకు వైసీపీ వారు తల పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తెలుగుదేశం పార్టీకి ఈవూరివారిపాలెం గ్రామం కంచుకోటగా ఉన్నది. దీనికి తోడు వైసీపీలో మిగిలి ఉన్న 50 ఎస్టీ కుటుంబాలు కూడా టీడీపీలో చేరటంతో వైసీపీ నాయకులకు మింగుడు పడలేదు. ఈ సంఘటనలో వైసీపీ వర్గీయులు తమ పై రాళ్ళు వేసి బీభత్సం సృష్టించారని టీడీపీ వర్గీయులు తెలిపారు. ఈ రాళ్ళ దాడిలో కొల్లూరి సుబ్బారావు(50) అనే వ్యక్తి గాయ పడ్డారని కూడా గ్రామస్తులు తెలిపారు. కాగా ఈ సంఘటనపై ప్రత్తిపాటి పుల్లారావు నరసరావుపేట డీఎస్పీ వర్మతో మాట్లాడారు. ఆయన చిలకలూరిపేటకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. కాగా ఈవూరివారి పాలెంలో జరిగిన సంఘటన నేపథ్యంలో బాధ్యులైన ఇరు వర్గాలకు చెందిన కొందరిపై బైండోవర్ కేసులు పెట్టబోతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఈవూరివారిపాలెంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబందించి చిలకలూరిపేట రూరల్ పోలీసు కేసు నమోదైంది.

అప్పులబాధ తాళలేక

కౌలు రైతు ఆత్మహత్య



గుర్రం చిన కోటయ్య (ఫైల్)

బొల్లాపల్లి, మే1: మండలంలోని పేరూరుపాడు గ్రామానికి చెందిన గుర్రం చినకోటయ్య(42) అప్పుల బాధ తాట్టుకోలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు బుధ వారం బొల్లాపల్లి ఎస్ఐ చెన్నకేశ వులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోటయ్య 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని 2 ఎకరాల్లో మిర్చి, 3 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంటలు సరిగా పండక ఆసించిన దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయి సుమారు రూ.6 లక్షలు అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పుల బాధ తట్టుకోలేక ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కోటయ్య మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు.

కూటమి విజయానికి మేనిఫెస్టో సోపానం

● పల్నాడు జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు బ్రహ్మం గౌడ్

రెంటచింతల, మే 1: కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తాననడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నేత, పల్నాడు జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షులు పోలగాని బ్రహ్మం గౌడ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ జనసేన బీజేపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో బడుగులకు ఎంతో మేలు చేసేదిగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గౌడ వర్గీయలు సంక్షేమానికి చేసిన కృషిని మరువ లేమని అన్నారు. అమరావతి పునర్నిర్మాణం, సాగునీటి రంగం, పారిశ్రామిక పెట్టుబడులు,ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, చంద్రన్న బీమా, కాపు, బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు ఆయా వర్గాలకు మేలు చేస్తాయన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు.

సవతి తల్లిని హతమార్చిన కొడుకు

● కాళ్లకు విద్యుత్ షాక్ ఇచ్చి.. ఆపై హత్య

దాచేపల్లి, మే 1: ఇల్లు తనపేరున రాయలేదని సవతి తల్లి కాళ్లకు విద్యుత్ షాక్ ఇచ్చి ఆపై గడ్డపారతో తలపై మోది హత్యచేసిన ఘటన బుధవారం దాచేపల్లి మండలం గామాలపాడు పంచాయతీ శివారు శంకరాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన బాణావత్ లక్ష్మీబాయి (45) అదే గ్రామానికి చెందిన దత్తునాయక్‌ను దత్తత తీసుకుంది. గత నాలుగు రోజుల నుంచి దత్తునాయక్ లక్ష్మీబాయి నివాసం వుంటున్న ఇంటిని తనపేర రాయాలని పలురకాలుగా వేదిస్తూ ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ స్తంభం నుంచి వైర్లకు లైన్ కలిపి నేరుగా ఆమె కాళ్లకు తగిలించాడు. ఆ తరువాత పక్కనే వున్న గడ్డపలుగుతో ఆమె తలపై మోది హత్య చేశాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తనంతట తానుగా వచ్చి లొంగిపోయాడు. లక్ష్మీబాయి భర్త బాణావత్ హరినాయక్ గత రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రచార రథంపై ఫీల్డ్ అసిస్టెంట్ మాలపాటి బాబు

వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్


వికొండటౌన్, మే 1: వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మార్చి 19న మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారి ప్రచారాల్లో గోనుగుంట్ల వారిపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బాలు పాల్గొనడాన్ని టీడీపీ నేతలు గుర్తించి ఆర్వోకు ఫిర్యాదు చేశారు. అలాగు ఉప్పరపాలెంలో కిషోర్ కుమార్, దొండపాడు ఫీల్డ్ అసిస్టెంట్ కొండలు ప్రచారంలో పాల్గొనడంతో వారికి నోటీసులు జారీచేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

తాడేపల్లి టౌన్, మే 1: ఎంటీఎంసీ పరిధిలోని బ్రహ్మానందపురం ఎయిమ్స్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం వెలవపేట గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకటేష్‌నాయుడు పెద్ద కుమారుడు గౌతమ్‌నాయుడు(12) అక్కడి వేసవి సెలవులకు తాడేపల్లి పరిధి కొలనుకొండలోని తాతయ్య కృష్ణారావు ఇంటికి వచ్చాడు. ఉదయం పాల ప్యాకెట్లు తీసుకురమ్మని బాలుడికి ద్విచక్ర వాహనం ఇచ్చి బైపాస్ రోడ్డులోని పాలబూతుకు పంపించారు. ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి వెంట వున్న ఎయిమ్స్ హాస్పిటల్ రోడ్డులోకి బాలుడు వచ్చాడు. ఈ క్రమంలో ఎదురుగా వెళుతున్న క్రేన్‌ను దాటుతూ అదుపుతప్పి క్రేన్ కిందపడడంతో అక్కడికక్కడే బాలుడు గౌతమ్ మృతిచెందాడు. ఈ ప్రమాద సంఘటనపై బాలుడి తండ్రి రామిశెట్టి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.

అమరాతికి ద్రోహం చేసిన వైసీపీకి ఓటు వెయ్యొద్దు

● 1597వ రోజుకు చేరుకున్న నిరసనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే1: రాజధాని అమరావతిని నాశనం చేసిన వైసీపీకి ఓట్లు వేయవద్దు అని 33 వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు విన్నవించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతులు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్నఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1597వ రోజుకు చేరకున్నాయి.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజా రాజధాని కోసమని అమరావతికి భూములిస్తే, సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండి పడ్డారు. అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యమన్నారు. రాజధానిని విచ్ఛిన్నం చేసిన జగన్‌ను ఓడించాలని, అమరావతి నిర్మాత చంద్రబాబును సీఎం చేద్దామని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140. 149.160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00



నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నల్లమోతువారిపాలెం వైసీపీ నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కర్లపాలెం, మే 1 : కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నల్లమోతువారిపాలెం గ్రామ వైసీపీ ఇన్‌చార్జి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంటా రత్నబాబు మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమౌతుందని, ప్రజలకు మేలు జరుగుతుందని భావించి వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నామన్నారు. వైసీపీ నుంచి వచ్చిన నాయకులందరికి వేగేశన నరేంద్రవర్మ తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నల్లమోతువారిపాలెం వైసీపీ ఇన్‌చార్జి కుంటా రత్నబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుంటా సూరయ్య, వైసీపీ నాయకులు ఇక్కుర్తి నాగాంజనేయులు, గరిగంటి రంగారావు, మాడా శేషగిరిరావు, మాడా రాంబాబు, ఇక్కుర్తి సాంబయ్య, ఇక్కుర్తి పూర్ణచంద్రరావు, తాండ్ర ఆదినారాయణ, తాండ్ర సుబ్బారావు, మాడా సాంబయ్య, జిలపేగు తిరుపతిరావు, మాడా నాగాంజనేయులు, మాడా శేషు తదితరులు టీడీపీలో చేరగా నరేంద్రవర్మ పసుపుకండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీలో చేరిన యాజలి మాజీ సర్పంచ్ దామర్ల

బాపట్ల, మే 1 : కర్లపాలెం మండలం యాజలి గ్రామ మాజీ సర్పంచ్ దామర్ల పూర్ణచంద్రరావు బుధవారం తెలుగుదేశంపార్టీలో చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆయనకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామపంచాయతీ పరిధిలో పార్టీబలోపేతానికి కృషి చేసి అభ్యర్థుల విజయానికి పాటుపడుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జికె.నాయుడు, పల్లంజీవన్, కత్తిదానియేలు పాల్గొన్నారు.

తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోవర్ధనరెడ్డి



గోవర్ధనరెడ్డి

బాపట్ల, మే1 : వైసీపీ నుంచి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డికి టీడీపీలో సముచిత స్థానం కల్పించారు. వైసీపీలో తనకు సరైన గౌరవం ఇవ్వక పోగా పార్టీ కార్యక్రమాలకు సైతం పిలవకుండా ఎమ్మెల్యే కోన రఘుపతి ఒంటెద్దు పోకడ పోతున్నాడని చెప్పి టీడీపీలో చేరిన ఆయనను గౌరవిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం గోవర్ధనరెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ప్రకటించారు. దీంతో గోవర్ధనరెడ్డి అనుచరులతోపాటు నియోజకవర్గంలోని రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపి తామంతా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తాం : వేగేశన

బాపట్ల, మే 1 : కార్మికుల సంక్షేమానికి కూటమి కట్టుబడి పనిచేస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. భావపురి టూవీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మేడే బాపట్ల పాతబస్టాండ్ సెంటర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం వెనుక నిర్వహించారు. కార్యక్రమానికి నరేంద్రవర్మ పాల్గొని కార్మిక జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. నరేంద్రవర్మను అసోసియేషన్‌నాయకులు ఘనంగా సత్కరించి సన్మానించారు.

● వైసీపీ పాలనలో కార్మికులు తీరని ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు అన్నారు. బాపట్ల ఎఫ్‌సీఐ గోదాంల వద్ద బుధవారం మే డే నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ, సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డి.దేవరాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి.శంకర్‌రెడ్డి, డి.రవి, కార్మికులు పాల్గొన్నారు.

● కార్మికుల సంక్షేమానికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయ కళాశాల ఆవరణలో బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవం నిర్వహించారు. కళాశాల టైమ్‌స్కేల్ యూనియన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల డిప్యూటీ డైరెక్టర్ టి.సత్యనారాయణ, ఎస్టేట్ సూపరింటెండెంట్ వై.అప్పారావు, యూనియన్ కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామపంచాయతీ కొల్లా వెంకయ్యకాలనీలో బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి రాష్ట్రనాయకులు మేకల ప్రసాద్ పాల్గొన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం మండలాధ్యక్షురాలు కొండా అన్నమ్మ, డ్రైవర్స్‌కాలనీలో సీనియర్ నాయకులు పి.పోలమ్మ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం కార్యదర్శి మువ్వల పల్లవి, నాయకులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, మే 1 : కర్లపాలెం బస్టాండ్ వద్ద ట్రక్కు ఆటో యూనియన్ సభ్యులు మేడే జెండాను ఆవిష్కరించారు. కర్లపాలెం గౌడపాలెంలో గౌడ కార్మికులు మేడే జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రిక్షా, ఆటో యూనియన్‌ల కార్మికులు మేడే జెండాను వాహనాలకు కట్టి కర్లపాలెం సెంటర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు.

● వేమూరు, మే 1: మండలంలోని వేమూరు, జంపని గ్రామాల్లో వివిధ సంఘాల కార్మికులు నిర్వహించిన మేడే ఉత్సవాల్లో బాపట్ల జిల్లా కార్యదర్శి టికృష్ణ మోహన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, వివిధ సంఘాల నాయకులు రమేష్, రత్నకుమారి, ధనలక్ష్మీ, పుల్లారావు, అరుణ, బుల్లిబాబు పాల్గొన్నారు.

● కొల్లూరు, మే 1: కార్మిక దినోత్సవాన్ని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం కొల్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో మాజీ ఎంపీపీ, సీపీఎం నాయకులు అమ ర్తలూరి కృపానందం మేడే జెండాను ఆవిష్కరించారు. కొల్లూరు ఆటోస్టాండ్‌లో మేడే ఉత్సవాలు నిర్వహించి ఆటో వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కళ్లెం రాజు బస్టాండ్ సెంటర్లో జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ అనుబంధ సంఘాలు, ఆటో, రిక్షా, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● రేపల్లె, మే 1: ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నదని కాంగ్రెస్‌పార్టీ నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాలు ఏఐటియూసీ ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి.నాగాంజనేయులు, గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వవైద్యశాల, నెహ్రూబొమ్మ వద్ద, వేజళ్ళవారిలంక రైస్‌మిల్లు వద్ద తదితర ప్రాంతాల్లో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో మేడే జెండాను కార్మిక సంఘ నాయకురాలు మండవ శోభారాణి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, ఈశ్వరరావు, కె.రాఘవ, బి.చంటి, కె.వాణి తదితురులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సంక్షేమం

బాపట్ల, మే 1 : తెలుగుదేశంతోనే మహిళా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ బాపట్ల మండల మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ కాగిత నాగభూషణమ్మ తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్ విజయం కోరుతూ బుధవారం ఈతేరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబుష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణి చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీనాయకులు పొలు, దమ్ము బాబురావు, రవిచంద్, కె.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

బాపట్ల, మే 1 : ఎలక్షన్ డ్యూటీకి వెళ్ళే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం వై.విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టిశ్రీనివాసరావు, ఆర్టీసీ నోడల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులను కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్ళు

బాపట్లరూరల్, మే 1 : మంగళగిరికి చెందిన భానుప్రకాష్, కిరణ్‌బాబులు తోటి స్నేహితులతో కలిసి సూర్యలంక తీరానికి వచ్చి అయితే అలలు తాకిడి ఎక్కువగా ఉండటంతో ఆ ఇద్దరు యువకులు కొట్టుకుపోతుండగా గమనించిన గజఈతగాళ్ళు, పోలీసులు వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. పర్యాటకుల ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, ఎన్.నరసింహమూర్తి, శ్రీనివాసరావు, నాగరాజు, గజఈతగాళ్ళు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, శివకోటేశ్వరరావులను పర్యాటకులు అభినందించారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

బాపట్ల,మే1 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్రె కోటయ్యను చంపేస్తానంటూ ఫోన్‌లో బెదిరించి అసభ్యంగా దూషించాడంటూ చేసిన ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకుడు జోగిరాజాపై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ యుశ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా జోగి రాజాను అసభ్యంగా దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతూ సామాజిక మాధ్యమాలలో పోస్ట్‌లు పెట్టారని చేసిన ఫిర్యాదు మేరకు పర్రె కోటయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీడీపీని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి, సంక్షేమం

● మాజీ మంత్రి ఆనందబాబు



బూతుమల్లిలో ఆనందబాబుకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

వేమూరు, మే 1 : నియోజకవర్గంలో ప్రజలు గతంలో రెండు సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు. మంత్రిగా కూడా పని చేశాను. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సహకరించాను. నాలుగోసారి అసెంబ్లీ బరిలో పోటీలో ఉన్న నన్ను ఈసారి కూడా గెలిపించండి అభివృద్ధి, సంక్షేమాన్ని సంపూర్ణంగా అందిస్తా అంటూ వేమూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీలో ఉన్న నక్కా ఆనందబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చంపాడు, బూతుమల్లి, బేతాళపురం గ్రామాల్లో పర్యటించారు. చంపాడు గ్రామంలో పార్టీ శ్రేణులు గజమాలతో ఆనందబాబుకు ఘనంగా స్వాగతం పలికారు. మూడు గ్రామాల్లో పర్యటించిన ఆనందబాబు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థ నలు చేసి ఆయనను ఆశీర్వదించారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి తిలకం దిద్దారు. ప్రతి ఇంటికి వెళ్ళి మేనిఫెస్టో కరపత్రాలను వివరించారు. అనంతరం ప్రచార వాహనంపై నుంచి ఆయన మాట్లాడుతూ నయవంచకుడైన జగన్ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని కూటమి ప్రభుత్వం సముచితమైన పాలన అందిస్తుందని మూడు నెలల్లో జగన్ జైలు పాలు కావడం కూడా ఖాయమేనని అన్నారు. లక్ష్యసాధకుడైన చంద్రబాబునాయుడుకు రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధాన భూమిక వహించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేయి కలపడం శుభపరిణామమని అన్నారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చేస్తామని, నిరుద్యోగ యువత మహిళలకు, రైతులకు వ్యాపారుల కు అనేక రంగాల్లో వృత్తిపరంగా జీవనాన్ని గడిపే వర్గాలకు సం బంధించిన ప్రణాళికాబద్ధమైన పథకాలను నూరుశాతం అమలు చేస్తామన్నారు. మోసపూరితమైన వాగ్దానాలతో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన నాగార్జున ఈ ఎన్నికల్లో తాను చేసిన మోసాలకు ప్రజలు ఏ మాత్రం సహకరించరు అన్న విషయాన్ని ముందుగానే గ్రహించి పలాయనం చిత్తగించాడని అన్నారు. ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన వ్యక్తి ఎన్నికలకు నాలుగు నెలల ముందు నియోజకవర్గం లో భయకంపితమైన వాతావరణాన్ని నెలకొల్పాడని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. నియోజకవర్గం లో అసెంబ్లీకి కూటమి అభ్యర్థిగా నిలబడ్డ తనతో పాటు బాపట్ల కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను మెజార్టీతో గెలిపించాలని కోరారు. పర్యటనలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, చంపాడు సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, వేమూరి మురళీకృష్ణ, దండే ముత్తయ్య, భీమినేని విజయలక్ష్మి, జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ నాయకులు గోగినేని కేశవరావు, తుమ్మల మనదమోహన్‌రావు, సత్యనారాయణ, వరప్రసాద్, గోగినేని అశోక్, వేమూరు శేషుబాబు, పీకా రాజేంద్రప్రసాద్, తేజ ప్రసాద్, కన్యధార తాతాజీ, కంచర్ల వంశీ, వాగోలు రాజు, పీక ఉదయ్, నాగరాజు, రాయల వినయ్, పోతుల గోపి పాల్గొన్నారు.



చంపాడులో భారీ గజమాలతో ఆనందబాబుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయం

● ప్రజలు ఎన్డీయే కూటమికి మద్దతునివ్వాలి

● ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అనగాని



రాజవోలులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 1: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభు త్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం చెరుకుపల్లి మండలం రాజవోలు, ఉప్పాలవారిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలంతా అష్టకష్టాలు పడ్డారన్నారు. పథకాల పేరుతో ప్రజలను నట్టేటముంచారన్నారు. వైసీపీ పాలనలో దోచు కో దాచుకో అన్న చందాన వ్యవహరించారని, పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారాన్ని మోపారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేశారని, మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడకొట్టారన్నారు. యువత ఉద్యోగావకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే యువత ఉద్యోగావకాశాలతో పాటు ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అందిస్తూ ప్రజా సంక్షేమ పాలనను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లాది రామకృష్ణ, తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, మత్తి భాస్కరరావు, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజవోలులో ఎమ్మెల్యే అనగానికి హారతులు ఇస్తున్న మహిళలు

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

● మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టితోపాటు పలువురి చేరిక



నరాలశెట్టి ప్రకాశరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు

బాపట్ల, మే 1 : ఎన్నికల ప్రచారంలో భాగంగా చీరాల విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సమక్షంలో బాపట్లకు చెందిన వైసీపీ నాయకులు పెద్దఎత్తున టీడీపీలో చేరారు. బాపట్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ మాజీ పట్టణాధ్యక్షుడు, సీనియర్‌నాయకుడు నరాలశెట్టి ప్రకాశరావు తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరగా చంద్రబాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ప్రకాష్ తెలిపారు. సీనియర్ న్యాయవాది, మాజీ కౌన్సిలర్, వైసీపీనాయకుడు భోగిరెడ్డి రమేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తిరుమలశెట్టి సాంబశివరావు, యువనాయకుడు కోటికలపూడి సురేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైసీపీ మాజీ అధ్యక్షుడు దగ్గుమల్లి ధర్మారావు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి అవినాష్‌నాయుడు తదితరులు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ, పార్లమెంట్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు.



మాజీకౌన్సిలర్, న్యాయవాది, వైసీపీ నాయకుడు భోగిరెడ్డి రమేష్‌రెడ్డికి, మాజీ కౌన్సిలర్ తిరుమలశెట్టి సాంబశివరావుకు, యువనాయకుడు కోటికలపూడి సురేష్‌కు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి అవినాష్‌నాయుడుకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు, చిత్రంలో నరేంద్రవర్మ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

● ఎన్నికల పరిశీలకులు పరిమళ్‌సింగ్

వేమూరు, మే 1 : నియోజకవర్గంలో ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందు కు అందరూ సహకరించాలని ఎన్నికల పరిశీలకుడు పరిమళ్‌సింగ్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు అధ్యక్షతన అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలబడిన అభ్యర్థుల సమావేశం నిర్వ హించారు. సమావేశానికి ఇండిపెండెంట్ అభ్యర్థులు ఐదుగురు హాజరయ్యారు. ప్రధాన పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు తమ ఏజెంట్లను సమావేశానికి హాజరుపరిచారు. పరిశీలకుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగేందుకు పార్టీల ప్రతినిధులు ప్రజలు సహకరించాలన్నారు. ప్రధానంగా వర్గవిబేధాలకు తావు ఇవ్వకుండా ప్రతి ఓటరు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసే విధంగా చూడాలని కోరారు.

చందోలులో అక్రమ మద్యం పట్టివేత

బాపట్ల, మే 1 : నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి సెబ్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. చందోలు గ్రామంలోని పాత అన్సార్ థియేటర్ పక్కన నదిముల్లాయపాలెం వెళ్ళే రోడ్డు వద్ద మున్నంగి వెంకటశివరామకృష్ణరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, అక్కల శివకృష్ణారెడ్డి సహకారంతో మద్యం తరలిస్తుండగా పట్టుకొని 96 మద్యం బాటిల్స్‌తోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఇబ్రహీం వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా, శివకృష్ణారెడ్డి సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారం

భట్టిప్రోలు, మే 1: బాలికకు మాయమాటలు చెప్పి బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన జరిగింది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామంలో నివాసం ఉంటున్న 5 సంవత్సరాల బాలికను పక్క గృహంలో నివాసం ఉంటున్న 13 ఏళ్ళ బాలుడు మంగళవారం రాత్రి అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. రేపల్లె డీఎస్పీ విచారణ అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం బాలికను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించనున్నట్లు చెప్పారు.

పీహెచ్‌సీ వైద్యుడిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

కొల్లూరు, మే 1 : పీహెచ్‌డీ వైద్యుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ మహిళా సిబ్బంది డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు పీహెచ్‌సీలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న దావులూరి రవిబాబు వైద్యకేంద్రంలోని లేబర్ రూమ్ పక్కన ఉన్న స్టోర్‌రూమ్‌లో ప్రతిరోజూ విధి నిర్వహణ సమయంలోనే మద్యం తాగుతూ విధులు నిర్వహిస్తున్న తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆరోపించారు. గత నెల 22వ తన ఫోన్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపాడని ఏఎన్ఎం తెలిపింది. వైద్యశాలలో మహిళా ల్యాబ్ టెక్నీషియన్ తనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో నెల రోజులు సెలవు పెట్టింది. తిరిగి విధుల్లో చేరేందుకు వెళ్లి వైద్యుడుని కలిసి సంతకం చేయాలని కోరగా అసభ్యంగా మాట్లాడాడని ఆరోపించింది. ఈ వైద్యుని అసభ్య ప్రవర్తన వల్ల తాము వైద్య కేంద్రంలో విధులు నిర్వహించలేకపోతున్నామని వైద్యుడిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా డీఎంహెచ్‌వో, ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రం ఇవ్వడంతో పాటు కలెక్టర్‌కు కూడా ఇచ్చేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ ఫిర్యాదును మెయిల్ ద్వారా పంపామని తెలిపారు.

ఆధునిక అభ్యుదయ సాహిత్యానికి 'మహాకవి' శ్రీశ్రీ మార్గదర్శకులు

బాపట్ల టౌన్, మే 1 : ఆధునిక అభ్యుదయ సాహిత్యానికి 'మహాకవి' శ్రీశ్రీ మార్గదర్శకులని, శ్రీశ్రీ సాహిత్యం నేటి యువత చదవాలని, ఆయన మార్గంలో పయనించాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత ఆధ్యాపకుడు జి.శాంతారాం, సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ తెలిపారు. బుధవారం శ్రీశ్రీ జయంతోత్సవాల సభలో వారు ప్రసంగించారు. సాహితీభారతి కోశాధికారి ఆదంషఫి, సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, కవితల పోటీల అవార్డు గ్రహీత పి.సాంబశివరావులు శ్రీశ్రీ విశిష్టతను గురించి తెలియజేశారు. సినీస్టంట్ మాస్టర్ శ్రీవల్లి శివకుమార్, సినీ రంగస్థల నటులు శివశంకర్, రచయితలు సంగానీ ఏడుకొండలు, ఆక్సిలను, కళాకారులను ఘనంగా సన్మానించారు. సాహితిభారతి ఉపాధ్యక్షుడు ఎం.మాల్యాద్రిరావు, భావపురి రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్, మోహన్‌కుమార్, జీవీ బ్రహ్మం, ఎన్.గుప్తా, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, విజయసారధి పాల్గొన్నారు.



రాజవోలులోని ఆర్యవైశ్యులకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

టీడీపీలో చేరిన ఆర్యవైశ్య సంఘీయులు

చెరుకుపల్లి, మే 1: గ్రామాలను అభివృద్ధిపర్చడంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ చూపిన చొరవ ఎవరూ చూపలేదని రాజవోలులోని ఆర్యవైశ్య సంఘీయులు అన్నారు. బుధవారం రాజవోలులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనగాని సత్యప్రసాద్‌ను ఆర్యవైశ్య కల్యాణ మండపానికి పిలిపించి గ్రామంలోని 30 ఆర్యవైశ్య కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనగాని మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి పార్టీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తానని భరోసానిచ్చారు. పార్టీలో చేరిన వారందరూ పార్టీ అభివృద్ధికి కృషి చేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించే విధంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా కనగాల గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు దుంప పూర్ణచంద్రరావు ఎమ్మెల్యే అనగాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, మల్లాది రామకృష్ణ, మాజీ సర్పంచ్ తుళ్ళూరి శివవెంకటరామారావు, రాంబాబు తదితరులు ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు

రేపల్లె, మే 1: మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. బుధవారం రేపల్లె మండలంలోని నల్లూరు, నల్లూరు నార్త్, అరవపల్లి పంచాయతీలలో ఎమ్మెల్యే అనగానికి మద్దతుగా ఇంటింటా ప్రచారం సోదరుడు శివప్రసాద్ నిర్వహించారు. ఎమ్మెల్యే అనగానికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఓటు హక్కు ద్వారా విజయం చేకూర్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, జనసేన మండల అధ్యక్షుడు రేపల్లె జానకిరామయ్య, టీడీపీ నాయకులు తొట్టెంపూడి సుభాష్, వడ్డి లక్ష్మీజీ, రేపల్లె సురేష్, బొందెలపాటి మల్లికార్జున్‌రావు, మల్లేశ్వరరావు, భూపతి బాలకృష్ణ, వేపూరి గోపి, నెల్లూరి రెడ్డియ్య పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమితోనే మహిళా సాధికారత



నిజాంపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ కమల అనగాని

రేపల్లె, మే 1: రాష్ట్రంలో మహిళా సాధికారత ఎన్డీఏ కూటమి అభ్యర్థులతోనే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సోదరి డాక్టర్ కమల అనగాని అన్నారు. బుధవారం నిజాంపట్నం గ్రామంలో ఇంటింటా ప్రచారం ఎమ్మెల్యే సోదరి డాక్టర్ కమల అనగాని, టీడీపీ నాయకులు నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే కూటమి అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌కు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్‌యాదవ్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, వర్ధిని, కవితా సాగర్, తుమ్మల విజయశాంతి, హైమా పాల్గొన్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో ఆనందబాబు ప్రచారం

కొల్లూరు, మే 1: నాలుగు గ్రామాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు గురువారం ప్రచారం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు పెసర్లంకలో ఆనందబాబు ప్రచారం ప్రారంభించి అనంతరం అవులవారిపాలెం, క్రీస్తులంక, గాజుల్లంక గ్రామాల్లో సాయంత్రం 4 గంటలకు అమృతలూరు మండలం గోవాడ, పాంచాళవరం గ్రామాల్లో జరిగే ప్రచారంలో పాల్గొంటారన్నారు.



ఎన్నికల విభాగాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయపరిశీలకులు ఎం.ఎస్.నీనానిగమ్



మహిళా ఉద్యోగినులతో ఉత్సాహంగా సెల్ఫీ దిగుతున్న బ్రాహ్మణి

యువత భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం

- టీడీపీతోనే యువతకు భవిష్యత్తు
- మంగళగిరిలో నారా బ్రాహ్మణి

మంగళగిరి, మే 1: గత అయిదేళ్లలో రాష్ట్రంలో యువత ఉపాధి, ఉద్యోగవకాశాలు లేక భవిష్యత్తును తీవ్రంగా నష్టపోయిందని నారా బ్రాహ్మణి అన్నారు. ఈ పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే యువతపై ఆధారపడిన కుటుంబాలు భయంకరమైన దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. అందుకే యువత భవిష్యత్తుకు జరుగనున్న ఎన్నికలు చాల కీలకమైనవైనవని.. ప్రతీ యువతి, ప్రతీ యువకుడు బాగా ఆలోచించి ఓటేయ్యాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి బ్రాహ్మణి బుధవారం మంగళగిరిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఆటోనగర్‌లోని పై కేర్ డాటా సెంటర్‌ను ఆమె సందర్శించారు. 2017లో లోకేశ్ ఐటీశాఖ మంత్రిగా వున్నపుడు ఆయన ఆహ్వానం మేరకు పైకేర్ కంపెనీని మంగళగిరిలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కంపెనీలో 650 మంది యువతీ యువకులు ఉద్యోగాలను చేస్తున్నారు. కంపెనీ సందర్శన సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ గత అయిదేళ్ల కాలంలో కొత్తగా రాష్ట్రానికి ఏతరహా కంపెనీలు రాకపోగా అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోయాయన్నారు. దీంతో యువత ఉద్యోగాల కోసం పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సివచ్చిందన్నారు. అందుకే తాను యువతకు తాను ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నిరుద్యోగం అనే మాటే వినబడదన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, కొత్తకొత్త పరిశ్రమలు, ఐటీ సంస్థలను రప్పించడంలో తెలుగుదేశానికి వేరెవ్వరూ సాటిరారని ఆమె నొక్కి చెప్పారు. రాబోయే కాలంలో పై కేర్ కంపెనీ పదివేల మందికి ఉపాధి కల్పిస్తుందన్న ఆశాభావాన్ని బ్రాహ్మణి వ్యక్తం చేశారు.

కష్టపడే తత్వం, పట్టుదల వుంటి లక్షణాలు మహిళలను సమాజంలో ప్రత్యేకంగా నిలుపుతాయనడంలో సందేహం లేదని చెప్పారు. మహిళలకు సరైన ప్రోత్సాహాన్ని ఇవ్వాలేకానీ మహిళలు అద్భుతాలను సృష్టిస్తారన్నారు. ఫైకేర్ కంపెనీలో ఇంతమంది మహిళలు పనిచేయడం తాను మొదటిసారి చూస్తున్నానన్నారు. తాను కూడ హెరిటేజ్‌ఫుడ్స్, బసవతారకం కాన్సర్ హాస్పిటల్, ఎన్టీఆర్ ట్రస్టు నిర్వహణలో భాగస్వామిగా ఉన్నానంటే అందుకు తన భర్త లోకేశ్, అత్తమామల సహకారమే కారణమని బ్రాహ్మణి అన్నారు.

ఫైకేర్ కంపెనీ ఛైర్మన్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో ఏపీకి వచ్చిన మొదటి కంపెనీ తమదేనన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లోకేశ్ ఎంతో తపన పడేవారన్నారు. లోకేశ్ ప్రోత్సాహంతోనే మంగళగిరిలో తమ ఫైకేర్ డాటా సెంటర్‌ను ప్రారంభించామన్నారు. గత అయిదేళ్లలో మాత్రం తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందకపోయినప్పటికీ తాము ఎంతో ధైర్యంగా కంపెనీని నడుపుతూ వచ్చామన్నారు. తమ ఈ కంపెనీలో భవిష్యత్తులో మరింతమందికి ఉద్యోగవకాశాలను కల్పిస్తామని ఆయన భరోసాగా చెప్పారు. కాగా, బ్రాహ్మణితో మాట్లాడేందుకు ఐటీ ఉద్యోగులు ఉత్సాహాన్ని కనబరిచారు. భవిష్యత్తులో మరిన్ని కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలను కల్పించాలని వారు బ్రాహ్మణికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమం జరిగినంతసేపు ఫైకేర్ డాటా సెంటర్ ప్రాంగణం జై బాలయ్య నినాదాలతో మార్మోగిపోయింది.

- ప్రశాంత ఎన్నికలకు అధికారులు పనిచేయాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు ఎం.ఎస్.నీనానిగమ్

మద్యం, నగదు పంపిణీని అరికట్టాలి

బాపట్ల, మే 1: ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, నగదు, బహుమతుల పంపిణీని అధికారులు పూర్తిగా అరికట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయపరిశీలకులు ఎం.ఎస్.నీనానిగమ్ తెలిపారు. వ్యయ పర్యవేక్షణ కమిటీ, అనుబంధ విభాగాల అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో సున్నితమైన అంశాలను సైతం పరిగణలోకి తీసుకోవాలన్నారు. సమన్వయంతో పనిచేసినప్పుడే ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించవచ్చన్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రయాణించే వాహనాలను నిశితంగా తనిఖీ చేయాలన్నారు. మద్యం విక్రయాలు అధికంగా నమోదైతే ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 4.80 కోట్ల విలువైన మద్యం, ఆభరణాలు, నగదు, బహుమతులు, ప్రచార సామాగ్రి సీజ్ చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్త నియమావళి ఉల్లంఘనపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బలగాలను నియమించామన్నారు. సమావేశంలో పార్లమెంట్ వ్యయపరిశీలకులు ఎస్.అరుణ్‌కుమార్, స్వప్నిల్ సాహేబ్‌రావు, కన్నయ్యపద్దార్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, నోడల్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటింగ్ యంత్రాలు కేటాయింపు

పోలింగ్ కేంద్రాలకు అత్యంత పారదర్శకంగా ఓటింగ్ యంత్రాలను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఎన్నికల పరిశీలకులు పరిమళ సింగ్, ఖాజన్‌సింగ్ సమక్షంలో బుధవారం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. బాపట్ల లోక్‌సభ పరిధిలోని 1766 పోలింగ్ కేంద్రాలకు 2166 బ్యాలెట్‌యూనిట్లు, 2,528 వీవీ ప్యాట్స్ యంత్రాలను కేటాయించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఆర్వోలు చేపట్టిన ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా వారు పర్యవేక్షించారు.

ఏజెంట్లు కోవర్టులుగా ఉంటే

అభ్యర్థులు మటాషే..!

రెంటచింతల, మే 1: ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల్లో కూర్చుని దొంగ ఓట్లను నివారించే ఏజెంట్ల చేతిలో పోటీలో వుండే ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం ఆధారపడి ఉంది. మార్చి 16 నుంచి పడిన కష్టానికి ఆ ఒక్క రోజే ఫలితం ఇవ్వనుంది. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అని గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా చూడడం ఏజెంట్ల విధి. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలికను ఏజెంట్ నిశితంగా పరిశీలించి ప్రిసైడింగ్ ఆఫీసర్(పీవో) దృష్టికి తీసుకెళ్లాలి. అనుమానం వస్తే తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేయవచ్చు. ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు తమకు నమ్మకమైన వారినే కూర్చోపెట్టాలి. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా బెదిరింపులకు భయపడినా ఎదుటి పార్టీకి కోవర్టుగా మారినా పోటీలో వున్న వారు ఇంతే సంగతులు చిత్తగించవలెను. ఎన్నికల్లో పెట్టిన కోట్ల ఖర్చు, శ్రమ నీళ్లపాలవుతుంది.

ఓటు వేయడానికి

ఇవి చూపిస్తే చాలు



వివిధ రకాల ఐడీ కార్డులు

రెంటచింతల, మే 1: రానున్న ఎన్నికల్లో గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయవచ్చని భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చుని అధికారులు పేర్కొంటున్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు,పోస్టాఫీసు లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటో ఉన్న పాసు పుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకార్డు, ఫించన్ మం జూరుచేసిన డాక్యుమెంట్, దివ్యాంగుల ఐడీ కార్డు చూపించి ఓటు వేయవచ్చు.

వైసీపీ.. జౌట్

- వరగానిలో బలసానిని తాకిన అసమ్మతి సెగ
- కిరణ్ పర్యటన ముగిసిన నిమిషాల వ్యవధిలోనే ఫ్లెక్సీల తొలగింపు
- 200 మందితో తెలుగుదేశం పార్టీలోకి వెళ్లేందుకు మంతనాలు

పెదనందిపాడు, మే 1: ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీకి గడ్డు పరిస్థితి ఎదురైంది. బలసాని కిరణ్‌కుమార్‌ను వైసీపీ ఇన్‌చార్జిగా నియమించినప్పటి నుంచి గ్రూపులకు ఆజ్యం పోసినట్టు అందరూ రగిలిపోతున్నారు. పార్టీకి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కొందరు ముఖ్య నేతలు సైతం బలసాని కిరణ్ కుమార్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో ఇప్పటికే వైసీపీ నుంచి వేల సంఖ్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయి. కరుడుగట్టిన వైసీపీ నాయకులు సైతం సైలెంట్‌గా టీడీపీ పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. అయితే పెదనందిపాడు మండలంలో ఓ వర్గం మాత్రం ఏకంగా ఒక అడుగు ముందుకు వేశారు. మేము ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం ఉండటానికి వీలు లేదని పూర్తిగా కార్యాలయాన్ని మూసి వేశారు. ముఖ్యమంత్రి జగన్‌తో పాటు కిరణ్ కుమార్ ఉన్న పెక్సీలను, బోర్డులను పీకి వేసి కార్యాలయాన్ని ఏకంగా మూసివేశారు. బలసాని కిరణ్ కుమార్ వరగానిలో ప్రచారం చేసి గ్రామం దాటిన నిమిషాల వ్యవధిలోనే ఫ్లెక్సీలను చింపి వేశారు.

బలసానిపై అసమ్మతే కారణం

బలసాని కిరణ్ కుమార్ ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా వచ్చిన నాటి నుంచి ఆయన ఒక వర్గానికే కొమ్ముకాస్తూ వస్తున్నాడు అనే వాదన వైసీపీ వర్గాల్లో బలంగా ఉంది. ఈ క్రమంలో గ్రామాలలో గ్రూపులకు కొమ్ము కాస్తూ ఒక వర్గాన్నే పక్కన పెట్టుకుంటున్నాడని వైసీపీ నాయకులే ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అధికంగా ఉండే మాల సామాజిక వర్గాన్ని పూర్తిగా దూరం పెట్టారనే వాదన కూడా వినిపిస్తుంది. ఈ క్రమంలోనే వరగానిలో పర్యటన వివరాలను ఒక వర్గానికి చెప్పి, మరో వర్గాన్ని దూరంగా పెట్టారు. దీంతో కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా ఈ విధంగా తమను అవమానించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం జెండాలు మోసి, ఫ్లెక్సీలు కట్టి డబ్బులు ఖర్చు పెడుతున్న తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని వారు బావించారు. తమ గౌరవం లేని చోట ఒక్క నిమిషం కూడా ఉండకూడదని బావించిన వైసీపీ నాయకులు కార్యకర్తలు తాము ఏర్పాటు చేసి పార్టీ కార్యాలయాన్ని మూసి వేసి ఫ్లెక్సీలను చింపి పడేశారు. అంతటితో ఆగకుండా తెలుగుదేశం పార్టీలోనికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వెంటనే తెలుగుదేశం పార్టీ మండల నాయకులతో సమావేశమయ్యారు.



పార్టీ ఫ్లెక్సీలతో దర్శనమిస్తున్న వైసీపీ కార్యాలయం



వరగానిలో వైసీపీ కార్యాలయంపై ఉన్న ఫ్లెక్సీలను తొలగించిన దృశ్యం

టీడీపీతోనే మాదిగలకు గుర్తింపు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య



మాదిగల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, పక్కన జీవీ ఆంజనేయులు తదితరులు

వినుకొండ టౌన్, మే 1: స్వాతంత్రం వచ్చిన తర్వాత మాదిగలకు గుర్తింపు ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్‌లో బుధవారం మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్ల రామయ్య మాట్లాడుతూ నిప్పుకణిగా మారిన లోకేశ్‌తో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అంతం కాబోతుందని జోస్యం చెప్పారు. మాదిగలకు ఏదైనా పార్టీ ఉందంటే అది తెలుగుదేశం పార్టీ అని, 175 నియోజకవర్గాల్లో మాదిగలు ఎన్డీఏ కూటమి నాయకులను గెలిపించాలని పిలుపునిచ్చారు. వైసీపీలో ఏనాడు మాదిగలకు కుర్చీవేసి కూర్చోపెట్టలేదని, చంద్రబాబు నాయుడు మాదిగలకు గుర్తింపు తెచ్చారని తెలిపారు. వినుకొండలో కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులును, కృష్ణదేవరాయలను అత్యాధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మాదిగలకు రెండు సెంట్లు స్థలం ఇచ్చి, ఎన్టీఆర్ నివాస గృహాలు నిర్మిస్తామని, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, మాదిగ టీడీపీ సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ట్రాక్టర్లపై తరలివస్తున్న అభిమానులు



చీరాల ప్రజాగళంలో బుధవారం ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అభిమానులు



సభకు హాజరైన అశేష ప్రజానీకం



బొటనవేలు నరుక్కున్న మహిళ పరిస్థితి విషమం

- ఐదు రోజులుగా గుంటూరులో నిరాహార దీక్ష
- క్షీణించిన దళిత మహిళ ఆరోగ్యం
- స్పందించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

గుంటూరు, మే 1 : ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న అరాచకాలు, అక్రమాలపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టిన దళిత మహిళ, ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరు లక్ష్మీ పరిస్థితి విషమంగా తయారైంది. ఐదు రోజులుగా ఆమె గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన విషయం విదితమే. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను నిరసిస్తూ ఆమె ఇటీవల దేశ రాజధాని న్యూఢిల్లీలో బొటనవేలును నరుక్కొని నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. బాధిత మహిళ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందించారు. ఆ తర్వాత ఆమె గుంటూరు చేరుకొని తన నివాస ప్రాంతమైన స్వర్ణ భారతి నగర్ పరిధిలోని కృష్ణ తులసి నగర్‌లో ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆమె దీక్ష ప్రారంభించి బుధవారం నాటికి ఐదు రోజులు పూర్తయింది. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. బొటనవేలు నరుకున్న అనంతరం ఆమె ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆ తర్వాత నుంచి కనీసం ట్యాబ్లెట్లు కూడా వాడకుండా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండటంతో ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దేశ రాజధానిలో బొటనవేలు నరుక్కున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఐదు రోజులుగా గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా స్పందన కరువైంది. బుధవారం నిరాహార దీక్ష శిబిరం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. వేలునరుక్కున్నా, ప్రాణాలకు తెగించి ఆమరణ నిరాహారదీక్షకు దిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించే క్రమంలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధమన్నారు. రాష్ట్రాన్ని గంజాయి మయంగా మార్చారన్నారు. చిన్నారులు సైతం గంజాయికి బానిసలు అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేద, దళిత వర్గాలకు చెందిన పిల్లలను గంజాయికి బానిసలుగా చేసి వారి ద్వారా గంజాయి విక్రయాలు చేస్తూ రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. అదేవిధంగా భూకబ్జాలు, ఫోర్జరీ సంతకాలతో భూ దందాలు సాగిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు, హత్యలకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. త్వరలో రాష్ట్రానికి వస్తున్న మోదీని కలిసేందుకు అవకాశం కల్పించాలని ఆమె మీడియా ముఖంగా వేడుకున్నారు.



ఆమరణ దీక్షలో కోపూరి లక్ష్మీ

మే 13.. సైకిల్ గుర్తు.. ఏడుకు ఏడు గెలవాలి

» ఎండని ఇళ్లు దాటకుండా ఓటెయ్యకుంటే కొంపలు మునుగుతాయి

» టీడీపీ జాతీయ అధక్షుడు చంద్రబాబు


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

చీరాల, మే 1 : మే 13 ... సైకిల్ గుర్తు ... ఏడుకు ఏడు మనమే గెలవాలి.. మీ ఉత్సాహం చూస్తుంటే పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఆతృతగా ఎదురు చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఎండ అని ఎవరు కూడా ఆ రోజు ఓటు వేయకుండా ఇళ్లలో ఉండొద్దు. ఓటు వేయకపోతే కొంపమునుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. చీరాల బైపాస్ రోడ్డులో 216 జాతీయ రహదారి పక్కనున్న టీడీపీ కార్యాలయం సమీపంలో బుధవారం నిర్వహించిన ప్రజాగళం సభకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల నుంచి విశేష స్పందన వచ్చింది. వేల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నియోజవకర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు సభా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు తొలిపలుకులు పలికారు.


మాట్లాడుతున్న కొండయ్య, కృష్ణప్రసాద్.. కూటమి అభ్యర్థులైన ఏలూరి, కృష్ణప్రసాద్, కొండయ్య, గొట్టిపాటిని పరిచయం చేస్తున్న చంద్రబాబు

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు మాట్లాడుతూ 2019 ఎన్నికల నాటి పరిస్థితులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వివరించారు. ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. విజనరీ లీడర్‌గా చంద్రబాబు చేపట్టిన కార్యక్రమాల్లో తన వంతు పాత్రను తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న అరాచక పాలనను తరిమి కొట్టాలంటే కూటమి ప్రభుత్వం రావాలన్నారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చీరాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తాను చీరాల నియోజవకర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించి చీరాలలో అడుగుపెట్టేందుకు 8 కిలోమీటర్లు నడచి రావాల్సి వచ్చిందన్నారు. అధికార వైసీపీ సృష్టించిన ఆటంకాలు అందుకు కారణమన్నారు. ఆనాడు ఒక్కడిగా వచ్చిన తాను ఇప్పుడు వేలమంది ఆత్మబంధువులను తయారు చేసుకున్నానన్నారు. చీరాల బాగుపడాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు, బీచ్‌ల అభివృద్ధి, చీరాల, బాపట్లను జంట నగరాలుగా అభివృద్ధి చేయటం, సాగునీరు, ఎత్తిపోతల పథకాల అభివృద్ధి, కుందేరు, దండుబాట అభివృద్ధి, ఇవన్నీ జరగాలంటే కూటమి ప్రభుత్వం గెలవాలన్నారు. చంద్రబాబు తిరిగి సీఎంగా రావాలన్నారు. అందుకు ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు శివనారాయణ, పరిశీలకులు మాజీ ఎంపీ చిరంజీవి, కె. నారాయణ, బాచిన చెంచుగరటయ్య, డాక్టర్ సజ్జా హేమలత, సజ్జా వెంకటేశ్వరరావు, గజవల్లి శ్రీనివాసరావు, కొమ్మన బోయిన రజని, చీరాల గోవర్ధనరెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, వేలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతో ఫొటోలకు పోటీ

ప్రజాగళం సభకు హాజరైన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుతో కలసి ఫొటోలు దిగేందుకు పలువురు నాయకులు పోటీపడ్డారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం చింతగుంపలకు చెందిన 6వ తరగతి విద్యార్థి కరణం బుచ్చయ్య తాను చంద్రబాబుతో ఫొటో దిగాలని కోరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ కుర్రాడిని సభావేదికపైకి పిలిపించి బాబుతో ఫొటో తీయించారు. దీంతో ఆ గ్రామం నుంచి వచ్చిన వారేకాక చుట్టపక్కల వారు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నేత సజ్జా వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా తయారు చేయించిన మగ్గంను జ్ఞాపికగా అందజేశారు. మరో నేత డేటా నాగేశ్వరరావు సభ అనంతరం చంద్రబాబును శాలువాతో సత్కరించారు. ఆ క్రమంలో పలువురు చంద్రబాబుకు పలువురు ప్రత్యేక విజ్ఞప్తులు చేశారు.

బాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

ప్రజాగళం సభకు హాజరైన టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో వైసీపీకి చెందిన చీరాల 18వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య(ఉల్లిపాయల సుబ్బయ్య) టీడపీలో చేరారు. చంద్రబాబు పార్టీ కండువాను సుబ్బయ్య మెడలో వేసి పార్టీలోకి స్వాగతించారు. భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సుబ్బయ్య తెలిపారు.


చంద్రబాబుతో మాట్లాడుతున్న పాలేటి, పక్కన గరటయ్య


బాబుకు విక్టరీ సింబల్‌ను చూపిస్తున్న వృద్ధులు

పింఛన్‌ల ఘనత టీడీపీదే

» అధికారంలోకి రాగానే రూ.4వేలు

» కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

బల్లికురవ, మే 1 : పేదకు పింఛన్‌లను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదేనని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవివకుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అద్దంకి పట్టణంలోని 11వ వార్డులో ఎమ్మెల్యే రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి కూటమి సూపర్‌సిక్స్ పథకాలు, మేనిఫెస్టోపై ఓటర్లను కలిసి వారికి వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామని చెప్పారు. రూ.35 ఉన్న పింఛన్‌ను టీడీపీ రెండు వేలు చేసిందన్నారు. వెయ్యి రూపాయలు పెంచడానికి వైసీపీకి ఐదేళ్లు పట్టిందన్నారు. వృద్ధులతో జగన్‌రెడ్డి ఆటలాడుకున్నారు. తీవ్రమైన ఎండల కాలంలో వృద్ధుల చేతికి పింఛన్ ఇవ్వకుండా బ్యాంకు ఖాతాలకు వేయడం సరికాదన్నారు. గత నెలలో కూడా 33 మంది వృద్ధులు ఎండల కారణంగా మృతిచెందిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల కమిషన్ గుర్తించి వెంటనే ఇళ్లకు పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనవద్దని ఈసీ ఆదేశించిందన్నారు. టీడీపీ రాగానే వలంటీర్లకు రూ.10వేల జీతంతో వ్యవస్థను పునరుద్ధరిస్తామని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారన్నారు. మంచి చదువులు ఉన్న వలంటీర్లకు ఉన్నతమైన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. టీడీపీ పాలనలో పట్టణంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టిందని అలానే పెద్ద ఎత్తున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను అందించామన్నారు. అందరికీ మంచి పాలన రావాలంటే సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు టీడీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఫణీంద్రబాబు, కౌన్సిలర్ రంగిశెట్టి సుభాషిణిలహరి, అత్తులూరి రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు, కుందారపు రామారావు, గట్టుపల్లి రామారావు, నరేంద్ర, మాలిక్, బండారు రాఘవ పాల్గొన్నారు.


పథకాలపై అవగాహన కల్పిస్తున్న గొట్టిపాటి

కూటమికి పట్టంగట్టండి : గొట్టిపాటి

పంగులూరు, మే 1 : కూటమి ప్రభుత్వానికి పట్టంగట్టాలని, అధికారంలోకి రాగానే ఎస్సీల సంక్షమం కోసం అన్ని పథకాలను అమలు చేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో పంగులూరు కొత్త ఎస్సీ కాలనీకి చెందిన పలు కుటుంబాలవారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ కూటమి అభ్యర్థి రవికుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో జజ్జర వెంకటరావు, నాగరాజు, పవన్, అనిల్, దాసరి రాంబాబు, రామకృష్ణ, అరుణకుమార్, వంశీతో పాటు 40 కుటుంబాలు వారు ఉన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో ఎస్సీలకు సంబంధించిన 27 పథకాలు రద్దయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే నిలిచిపోయిన పథకాలన్నింటినీ అమలు చేస్తామన్నారు. డాక్టర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకాన్ని అందుబాటులో తెస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, మేడ సుబ్బారావు, కోటయ్య, సుబ్బారావు, శ్రీకాంత్, నాగేశ్వరావు, చౌదరిబాబు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటేస్తే రైతుల భూములు తాకట్టే : బాబీ

బల్లికురవ. మే 1 : వైసీపీకి మళ్లీ ఓట్లు వేస్తే రైతుల భూములు తాకట్టు పెట్టడం ఖాయమని ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించి తగిన బుద్ధి చెప్పాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) కోరారు. బుధవారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో అద్దంకి నియెజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్ కిషోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా అయన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. 13 సోమవారం జరిగే పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కూటమి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రశాద్‌ను గెలిపించాలని కోరారు. పలువురు రైతులతో బాబీ మాట్లాడుతూ వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రమాదకరమైనదన్నారు. మీ ఒరిజనల్ పత్రాలు ప్రభుత్వం వద్దనే ఉంచి, రైతులకు తెల్ల పేపర్లు ఇస్తారన్నారు. దీనివల్ల మీ భూములు తాకట్టులోకి వెళ్లిపోయే ప్రమాదముందన్నారు. టీడీపీ రాగానే ఆ చట్టాన్ని రద్దు చేస్తుందని ధైర్యం చెప్పారు. ప్రజలంతా వైసీపీ కుట్రలను తెలుసుకొని ఓటుతో బుద్ధి చెప్పాలని బాబీ విజ్ఞప్తి చేశారు. ఎడ్ల బండిపై బాబీని ఎక్కించి గ్రామంలోకి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి శంకర్, ఆళ్ల చంద్రమౌళి, యాగంటి సింగరయ్య, దివ్వె రామాంజనేయులు, ఏల్చూరి వీరయ్య, షేక్ మస్తాన్‌వలి, పెద మస్తాన్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బాబీ

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ విఫలం

సంతమాగులూరు : నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడంలో వైసీపీ ఘోరంగా విఫలమైందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. బుధవారం ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో గొట్టిపాటి సమక్షంలో సంతమాగులూరు మండలం చవిటిపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు గుడిపూడి ఉమామహేశ్వరరావు, టిక్కి, రామలింగయ్య, కందిమళ్ల వెంకటేశ్వర్లు, కందిమళ్ల ఆంజనేయులు, తన్నీరు అంకమ్మరావు, వల్లెపు అం కమ్మరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు టీడీపీలో చేరారు. వారందరికీ గొట్టిపాటి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ వై సీపీ పాలనలో యువత భవిష్యత్ ప్రశ్నార్థ కంగా మా రిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.


పంగులూరులో వైసీపీ వీడి టీడీపీలో చేరినవారితో గొట్టిపాటి

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రయోజనం

పంగులూరు, మే 1 : కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో, సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో సైకిల్ గు ర్తుపై ఓటువేసి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని తెన్నేటి శిరీష కోరారు. బుధవారం మండలంలోని కోటపాడు, కొండమూరు గ్రామాలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని స్థానిక నాయకులతో కలిసి శిరీష ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలు, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లికి వందనం, ఆడబిడ్డ చదువుకు సాయం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం, పింఛన్ పెంపు, డ్వాక్రాలకు రూ.10లక్షల వడ్డీలేని రుణం వంటి పథకాలతో పేదలు ఆర్థికంగా బలపడతారని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, తాటి సుబ్బారావు, మస్తానరావు, కృష్ణమూర్తి, కాటా అంజయ్య మస్తానరావు, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, మంద ఆమోస్, అమర్తపూడి చిన్న, ఉన్నం రవిబాబు టీడీపీ కార్యకర్తలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మేదరమెట్ల : టీడీపీ కూటమి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ సతీమణి శిరీషా తెలిపారు. మండలంలోని రాచపూడిలో బుధవారం జరిగిన ప్రచారంలో ఆమె కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, మందా ఆమోస్, మందా నాగేశ్వరావు, జాగర్లమూడి వీరాంజనేయులు, శ్రీనివాసరావు, తిరుపతయ్య, మాతయ్య, ఎలీషా, ఇస్మాయిల్, శేషయ్య, బుల్లియ్య, మరియమ్మ, రవీంద్ర, ఆదాం పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ కో రారు. బుధవారం మండలంలోని తమ్మవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేదరమెట్ల తమ్మవరం రోడ్డు, గోతుల మయంగా మారిందని గ్రామస్థులు హర్షవర్ధన్ దృష్టికి తీసుకురాగా ప్ర భుత్వం వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తా మన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు దెబ్బతిన్న గేట్లు పెట్టకుం డా రిజర్వాయర్‌లో నీళ్ల లే కుండా చేశారన్నారు. రిజర్వాయర్‌లోని ఇసుకను అక్రమంగా తరలించి దొచుకోవడానికే గేట్లు పెట్టలేదన్నారు. 13న జరిగే పోలింగ్ రోజు ఎమ్మెల్యేగా గొట్టిపాటికి, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న తెన్నేటి శిరీష

కూటమి వస్తేనే అన్నివర్గాల భవిష్యత్

చినగంజాం : కూటమి ప్రభుత్వం వస్తేనే అన్నివర్గాలకు భవిష్యత్ ఉంటుందని తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కాటంవారిపాలెం, కోడూరివారిపాలెం గ్రామాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు ఏలూరి కృష్ణప్రసాద్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం నాయకులు ప్రచారం నిర్వహించారు.

చంద్రబాబు పర్యటన సాగిందిలా

చీరాల, మే 1 : ప్రజాగళం సభకు హాజరయ్యేందుకు బుధవారం చంద్రబాబు హెలికాప్టర్‌లో చీరాల వచ్చారు. గం.4.25లకు హెలికాప్టర్ 216 జాతీయ రహదారి పక్కనున్న టీడీపీ కార్యాలయం వెనుక వైపు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. గం.4.27ని లకు చంద్రబాబు హెలికాప్టర్ నుంచి దిగారు. గం.4.41ని.లకు. సభా వేదికపైకి వచ్చారు. ముందుగా వేదికపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముందుగా ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, తరువాత ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య మాట్లాడారు. తరువాత గం.5.01ని.లకు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించారు. ఆద్యంతం శ్రేణుల్లో ఉత్సాహం నింపుతూ బాబు ప్రసంగం సాగింది. గం.5.48నిలకు ప్రసంగం ముగిసింది. అనంతరం హెలికాప్టర్‌లో గుంటూరు బయలువేరి వెళ్లారు.

ఎంఈవోగా అజయ్‌బాబు

ఇంకొల్లు, మే 1 : ఇంకొల్లు మండల నూతన విద్యాశాఖాధికారిగా బీ అజయ్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇంకొల్లుకు ఇద్దరు విద్యాశాఖాధికారులు ఉండగా, రాఘవరావు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో చిన్నగంజాం మండల విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న అజయ్‌బాబుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇవ్వగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పర్చూరుకు ముంచుకొస్తున్న నీటి ఎద్దడి

» చెరువులకు అరకొరగా సాగర్ జలాలు

» చర్యల్లో అధికారులు విఫలం » ఆందోళనలో ప్రజలు

పర్చూరు, మే 1: నియోజకవర్గ కేంద్రమైన పర్చూరుకు మంచి నీటి కష్టాలు ముంచుకొచ్చే పరిస్థితి నెలకొంది. వేసవిలో నీటి ఎద్దడిని అధికమించే విధంగా ప్రభుత్వం విడుదల చేసిన సాగర్ జలాలు మూడునాళ్ల ముచ్చటగా ముగిసాయి. నీటిని చెరువులకు నింపుకునేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఆయా చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో సాగర్ జలాలతో చెరువులను నింపాల్సి ఉంది. అయితే అధికారులు సకాలంలో స్పందికపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొందని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికితోడు పర్చూరు ఆయకట్టు చివర ఉండడం, సాగర్ కాలువల్లో చిల్లచెట్లు ముళ్ల పొదలు పెరిగిపోయి నీటి సరఫరా మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అన్నట్లు సరఫరా సాగింది. దీంతో పర్చూరు చెరువుకు సాగర్ నీరు అరకొరగానే చేరింది. పర్చూరులో ఉన్న రెండు మంచి నీటి చెరువుల్లో ఒక చెరువులో నీరు పూర్తిగా అడుగంటింది. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ఎన్ని రోజులు నీరు అందుబాటులో ఉంటుందో అర్థంకాని పరిస్థితి. పర్చూరులో 20వేలకు పైచిలుకు జనాభా ఉంది. ప్రస్తుతం రెండు రోజులకోసారి పంచాయతీ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దీనికి తోడు పర్చూరు ఆర్వో ప్లాంట్ ద్వారా చుట్టపక్కల గ్రామాల ప్రజలు మంచినీటిని వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీటి పరిమాణం తక్కువగా ఉండడంతో వేసవిలో నీటి పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరుతోపాటు, పెద్దివారిపాలెం, నాగులపాలెం చెరువుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఏది ఏమైనా అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. దీంతో ఈవేసవిలో నీటి ఎద్దడి తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రధాన చెరువులో అరకొరగా అడుగంటి ఉన్న నీరు